క్లుప్తంగా

నాగవరంలో నేడు పోలిపల్లెమ్మ పండగ


నాగవరంలోని పోలిపల్లెమ్మ తల్లి

మునగపాక : మండలంలోని నాగవరంలో మంగళవారం పోలిపల్లెమ్మ తల్లి పండగను ఘనంగా నిర్వహిస్తున్నట్టు మాజీ ఎంపీపీ దాసరి గౌరీలక్ష్మి అప్పారావు తెలిపారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అదే రోజు రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు, నేల వేషాలు ఏర్పాటు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని అప్పారావు కోరారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

యలమంచిలి : నేడు యలమంచిలి మున్సిపాలిటీ ధర్మవరం, క్లబ్ రోడ్డు వద్ద నున్న ఎస్సీ కాలనీ నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా యలమంచిలి ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబురాజు) మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి, మాజీ డీసీసీబీ చైర్మన్ సుకుమారవర్మ ఆధ్వర్యంలో నిర్వహించు ఈ కార్యక్రమానికి పట్టణంలో ప్రజా ప్రతినిధులు, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొనాలని మున్సిపల్ అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఘనంగా పోతురాజుబాబు పండగ

కోటవురట్ల : పాములవాకలో పోతురాజుబాబు పండగను ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. సమీప గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. మండల స్థాయి కోలాటం పోటీలు కనువిందు చేశాయి. ఈ పోటీలో నాతవరం ప్రథమ, పరవాడ మండలం బోణంగి ద్వితీయ, నర్సీపట్నం మండలం యరకన్నపాలెం తృతీయ స్థానంలో నిలిచాయి. ప్రథమ బహుమతిగా రూ.10 వేలు, ద్వితీయ బహుమతిగా రూ. 5 వేలు, తృతీయ బహుమతిగా రూ.3 వేలు నగదు అందజేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు రమణ, గ్రామ పెద్దలు, సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం


మునగపాకలో మజ్జిగ చలివేంద్రం ప్రారంభిస్తున్న ఎస్‌ఐ ఆలీ

మునగపాక : వేసవి తాపం నుంచి కాపాడేందుకు చలివేంద్రాలు ఎంతగానో దోహదపడతాయని మునగపాక ఎస్‌ఐ మహమ్మద్ ఆలీ తెలిపారు. మునగపాక పీఏసీఎస్ ఆవరణలో గ్రామస్తుల సహకారంతో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో గవర కార్పొరేషన్ చైర్మన్ ప్రసాద్, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రచార భేరి పోస్టర్ ఆవిష్కరణ


ప్రచార భేరి పోస్టర్ల ఆవిష్కరణ చేస్తున్న దృశ్యం

మునగపాక : ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని సీపీఐ మండల కార్యదర్శి మళ్ల మాధవరావు విమర్శించారు. సోమవారం మునగపాకలో సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ప్రచార భేరి పోస్టర్ ఆవిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవరావు మాట్లాడుతూ ప్రత్యేక హోదా, విభజన హామీలను అమలు చేయడం లేదన్నారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరించేందుకు చర్యలు చేపట్టడం విచారకరమన్నారు.

తాగునీటి బోర్లకు మరమ్మతులు

ఎస్.రాయవరం : వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్టు రేవుపోలవరం సర్పంచ్ భర్త, గ్రామ ఉపసర్పంచ్ బోడిపల్లి గోవిందు అన్నారు. గ్రామంలో మరమ్మతులకు గురైన తాగునీటి బోరులను యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయించి సరిచేశారు. వేసవి ఎండలు ముదిరే లోపు తాగునీటి సదుపాయాలు సమస్యలు తలెత్తకుండా చూస్తున్నట్టు చెప్పారు.

సంక్షేమ సారథికి మళ్లీ పట్టం కట్టాలి


మంగవరం గ్రామంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహిస్తున్న నాయకులు


నరేంద్రపురంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లక్ష్మి


లాలంకోడూరులో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం


చినగుమ్ములూరులో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో జెడ్పీటీసీ కాకర దేవి


నక్కపల్లిలో ఇంటికి స్టిక్కర్లు అతికిస్తున్న దృశ్యం

పాయకరావుపేట : రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రజారంజక పాలన అందిస్తున్న సంక్షేమ సారథి సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మళ్లీ మనమందరం రానున్న ఎన్నికల్లో పట్టం కట్టాలని నాయకులు ఆయా గ్రామాల్లో సంక్షేమ పథకాల లబ్ధిదారులకు, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. మా నమ్మకం నువ్వే జగన్ అనే నినాదంతో నాయకులు, సచివాలయ కన్వీనర్లు గ్రామాల్లో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలపై వివరిస్తున్నారు. సోమవారం మండలంలో గల వెంకటనగరం, మంగవరం గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాల పత్రాలను తీసుకుని వెళ్లి ప్రతి ఇంటి వద్ద పథకాలు అందుతున్న, పొందుతున్న విధానం పైన, లబ్ధిదారులు పొందుతున్న వైనం పైన అడిగి తెలుసుకుంటున్నారు. రైతులకు రైతు భరోసా, విద్యార్థులకు అమ్మ ఒడి, డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీ, వృద్ధులకు, వికలాంగులకు పింఛన్లు, కాపునేస్తం, ఈబీసీ నేస్తం, ఆసరా, విద్యా దీవెన, వసతిదీవెన, ఆరోగ్యశ్రీ, మత్స్యకార భరోసా వంటి పథకాలు లబ్ధిదారులకు అందుతున్న తీరు తెలుసుకుంటున్నారు. వాటిపై ప్రజల నుంచి సంతృప్తి వ్యక్తం కావడంతో ఆయా ఇళ్లకు జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోతో వున్న స్టిక్కర్లను డోర్లకు అతికించారు. పథకాలు నమోదు చేసిన బ్రోచర్లను పంపిణీ చేశారు. అనంతరం స్టిక్కర్లపై పొందుపర్చిన ఫోన్‌నెంబరుకు మిస్‌కాల్ లబ్ధిదారులు ఇస్తున్నారు. వెంకటనగరం కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ చోడిపల్లి శ్రీను, సచివాలయ మండల కన్వీనరు బొలిశెట్టి శ్రీను, కాకాడ కృష్ణ పాల్గొన్నారు. మంగవరం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ వంగలపూడి సరస్వతీ రామారావు, పీఏసీఎస్ చైర్మన్ దేవవరపు రాజేష్ ఖన్నా, పార్టీ నాయకులు పుత్రరావు, మానేపల్లి శ్రీను, నాగభూషణం, అశోక్ పాల్గొన్నారు.

మునగపాక : ప్రజా సంక్షేమ పాలన సాగిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా నిలవాలని వైస్ ఎంపీపీ బోజా లక్ష్మి కోరారు. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా చెర్లోపాలెం శివారు నరేంద్రపురంలో సచివాలయ కన్వీనర్, గృహ సారథులతో కలిసి సోమవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. టీడీపీ, వైఎస్సార్‌సీపీ హయాంలో గల తేడాను గుర్తించి వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా గెలిపించుకోవాలన్నారు. అనంతరం 5 ప్రశ్నలకు సంబంధించి సమాధానాలు నమోదు చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోతో కూడిన స్టిక్కర్లను ఇంటి యజమానుల సమ్మతంతో అంటించే కార్యక్రమం చేపట్టారు. అలాగే 8296082960 ఫోన్ నంబర్‌కు మిస్‌కాల్స్ ఇప్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత బోజా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రాంబిల్లి : మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి మండలంలో గల గ్రామాల్లో విశేష స్పందన లభిస్తుంది. సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు , గృహసారథులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా గడపగడపకు తిరుగుతూ సంబంధిత ప్రశ్నలు అడిగి వివరాలు నమోదు చేస్తున్నారు. లబ్ధిదారులు జగనన్న పాలనపై ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఎస్.రాయవరం : గ్రామాల్లో ఏ గడప తట్టినా జగనన్న పథకాలు కనిపిస్తున్నాయని జెడ్పీటీసీ కాకర దేవి అన్నారు. స్వగ్రామం అయిన చినగుమ్ములూరు గ్రామంలో సోమవారం మా నమ్మకం నువ్వే జగన్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ స్థానిక నాయకులతో కలిసి పలు గృహాలను సందర్శించారు. కార్యక్రమంలో కన్వీనర్ మెంద్రెడ్డి గోవిందు తదితరులు ఉన్నారు.

నక్కపల్లి : మండలంలో పలు గ్రామాల్లో సోమవారం మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం జరిగింది. నక్కపల్లిలో సింహాచలం దేవస్థానం ఆహ్వానితురాలు జనపరెడ్డి శేషారత్నం, మంగతాయారు, అల్లాడ రమణ బాబు, గొడిచర్లలో సర్పంచ్ అల్లు పార్వతి రమణ, సచివాలయ కన్వీనరు నల్లల రామకృష్ణ, రాజయ్యపేటలో కన్వీనర్లు ఎరిపల్లి నాగేశు, పిక్కి సూకరాజు, కాగితలో సర్పంచ్ పోతంశెట్టి రాజేష్, పార్టీ నాయకులు పోతంశెట్టి బాబ్జి, దేవవరపు శివ వెదుళ్లపాలెంలో వెదుళ్ల పాపారావు, వెదుళ్ల రమణ, రమణయ్యపేటలో సర్పంచ్ కర్రి శ్రీనివాస్, అమలాపురంలో వంకా కృష్ణ, పెద కాపు తాతారావు ఎన్.నర్సాపురంలో సర్పంచ్ పల్లా చినతల్లి, సచివాలయ కన్వీనరు పల్లా చినబ్బాయి తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. లబ్ధిదారులు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో జరిగిన మేలు ఏ ప్రభుత్వంలోనూ జరగలేదని వివరించారు. తమ మద్దతు జగనన్నకేనన్నారు.

నాన్ మేజర్ పోర్టు జీవోను నిలుపుదల చేయాలి


తహసీల్దార్ భాగ్యవతికి వినతిపత్రం అందిస్తున్న జేఏసీ నాయకులు

రాంబిల్లి : నాన్ మేజర్ పోర్టు జీవోను నిలుపుదల చేయాలంటూ వాడనర్సాపురం, కొత్తపట్నం మత్స్యకార జేఏసీ నాయకులు సోమవారం తహసీల్దార్ పి. భాగ్యవతికి వినతిపత్రం అందజేశారు. సముద్రంలో 12 నాటికల్ మైలు దూరంలో ఎటువంటి పోర్టులు నిర్మించరాదని జీవో ఇచ్చారని, దీంతో మత్స్యకారుల చేపల వేటకు ఆటంకం కలిగే అవకాశాలున్నాయని మత్స్యకార నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ రెండు గ్రామాలను తరలించి శాశ్వత ఉపాధి అవకాశాలు చూపించే వరకు ఈ జీవోను నిలుపుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల సచివాలయ కన్వీనర్ కొవిరి రామకృష్ణ, వాడనర్సాపురం సర్పంచ్ కారె రామారావు, ఎంపీటీసీ ధోనె నర్సింహులు, మాజీ సర్పంచ్ చింతకాయల ఎర్రయ్య, కొత్తపట్నం మాజీ సర్పంచ్ చోడిపల్లి సత్యనారాయణ , మండల పరిషత్ కోఆప్షన్ మెంబరు సీహెచ్ పెంటయ్య పాల్గొన్నారు.

పైపులైన్‌కు మరమ్మతులు


రంధ్రం పడిన పైపునకు మరమ్మతు పనులు

రాంబిల్లి : దిమిలి శ్మశాన వీధిలో రంధ్రం పడిన తాగునీటి పైపులైన్‌కు మరమ్మతు పనులు చేశారు. ఇక్కడ కొంత కాలంగా పైపులైన్‌కు రంధ్రం పడి తాగునీరు వృథాగా పోయేది. దీంతో పలు గ్రామాలకు తాగునీటి సమస్య వుండేది. తాగునీరు వృథాగా పోయి నీరు రోడ్డుపై నిల్వ చేరి వుండేది. దీంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడేవారు. ఈ నేపథ్యంలో పైపులైన్‌కు మరమ్మతు పనులు చేయించినట్లు సర్పంచ్ బంగారు చిలుకు, పంచాయతీ కార్యదర్శి జి. రాజుబాబు తెలిపారు.

అవగాహనతో అగ్నిప్రమాదాల నివారణ


అగ్నిప్రమాద సమయంలో చర్యలపై మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

సబ్బవరం: విద్యార్థులు అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా వ్యవహరించడంతో పాటు మరింత మందికి అవగాహన కల్పించాలని సబ్బవరం అగ్నిమాపక అధికారి దిలీప్ కుమార్ కోరారు.జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆరిపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తరచూ అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న అంశాలపై అగ్నిమాపక సిబ్బంది డెమో నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెళకువలను వివరించారు. కార్యక్రమంలో లీడింగ్ ఫైర్ మెన్ కె. అప్పలనాయుడు,డ్రైవర్ ఆపరేటర్ సీహెచ్ రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం!


లంకెలపాలెం రహదారిలో రోడ్డు పక్కన నిలిపిన భారీ వాహనాలు

పరవాడ: నిబంధనలకు విరుద్ధంగా రోడ్ల పక్కన నిలుపుతున్న భారీ వాహనాలతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. లంకెలపాలెం-పరవాడ, పరవాడ-వాడచీపురుపల్లి రహదారుల్లో బూడిద, బొగ్గు లారీలను ఎక్కడికక్కడ రోడ్ల పక్కన నిలిపేస్తున్నారు. రాంకీ కూడలి, మండల కాంప్లెక్సు, సినిమాహాలు కూడలి, ఊటగెడ్డ కూడలి, ఎన్టీపీసీ మెయిన్‌గేటు ప్రాంతాల్లో భారీ వాహనాలు రోడ్ల పక్కన నిలిపి లారీ సిబ్బంది టిఫిన్, భోజనాలకు వెళ్తున్నారు. దీంతో ప్రయాణికులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఇలా రోడ్లపై లారీలు నిలుపుతున్న వారిపై ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

తాటి ముంజెలకు గిరాకీ


మునగపాకలో తాటిముంజులు వేరు చేస్తున్న దృశ్యం

మునగపాక : వేసవి కాలం తీవ్రత ఎక్కువ కావడంతో తాటి ముంజెలకు గిరాకీ ఏర్పడింది. వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు పలువురు తాటి ముంజెలను ఆశ్రయిస్తున్నారు. పిల్లల నుంచి పెద్దల వరకు ముంజెలను తినేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో గిరాకీ పెరిగి తాటి కాయను రూ.10కు విక్రయిస్తున్నారు. డజను ముంజెలను రూ.40 నుంచి రూ.50కు విక్రయిస్తున్నారు. పాటిపల్లి, వాడ్రాపల్లి, రాజుపేట తదితర ప్రాంతాల్లోని చెట్ల నుంచి తాటికాయలు సేకరిస్తున్నామమని నిర్వాహకుడు శ్రీను తెలిపారు.

ఘాటెక్కిన కారం

- అమాంతం పెరిగిన ఎండు మిర్చి ధరలు
- మసాలా కారం తయారీ వస్తువులదీ అదే దారి


కశింకోట సంతలో విక్రయిస్తున్న కారం సరకులు

కశింకోట : కారం తింటే కాదు.. కొంటే కళ్లల్లో నీళ్లు తిరుగుతున్నాయి. వంటలో వేసే కారం తయారీకి వినియోగించే సరకుల ధరలు ఒక్కసారిగా పెరిగాయి. ప్రధానంగా ఎండుమిర్చి, జీలకర్ర ధరల్లో భారీ పెరుగుదల నెలకొంది. రెండు వారాల వ్యవధిలో ఎండు మిరపకాయలు రకాన్ని అనుసరించి కిలోకి రూ.50, జీలకర్ర నాణ్యతనుబట్టి రూ.140 వరకు అదనంగా పెరిగింది. దీంతో ప్రజలు కారం తయారీకి వినియోగించే సరకుల కొనుగోలుకు భయపడుతున్నారు.

వేసవిలోనే కారం తయారీ

వేసవి కాలంలో గ్రామీణ ప్రాంతంలో చాలా కుటుంబాలు ఎవరి ఇష్టం మేరకు వారు పలు రకాల మసాలా దినుసులు వేసుకుని, కారం తయారు చేసి, నిల్వ చేసుకుంటున్నారు. పచ్చళ్లు, కూరలకు ఏడాదంతా దీన్నే వినియోగిస్తారు. అధిక ఉష్ణోగ్రతలుండే వేసవిలో కారం తయారు చేస్తే తేమ లేకుండా ఎక్కువ కాలం నిల్వ ఉంటుంది. దీంతో వేసవిలోనే ఎక్కువ మంది కారం తయారు చేసుకునేందుకు మొగ్గు చూపుతారు. కారం తయారీలో ప్రధానంగా పొడవు, పొట్టి రకాల ఎండు మిరపకాయలు వినియోగిస్తారు. పొడవు రకం కారం ఘాటు ఎక్కువగా ఉంటుందని, పొట్టి రకం కారం ఘాటు తక్కువగా ఉండి పరిమాణం ఎక్కువ వస్తుందని రెండు రకాలు వినియోగిస్తారు. అయితే ప్రస్తుతం పొట్టి రకం మిరపకాయలు రావడం అరుదుగా మారింది. దీంతో పొడవు రకం మిరప కాయలతో ఎక్కువగా కారం తయారు చేసుకుంటున్నారు.

స్థానిక మిర్చికి డిమాండ్

స్థానికంగా పండించే మిరపకాయల కంటే గుంటూరు మిర్చికి కాస్త డిమాండ్ ఎక్కువ. గుంటూరు మిర్చికి ఘాటెక్కువ. మరి కొందరు గుంటూరు మిర్చి కంటే స్థానికంగా పండే మిర్చి ఆరోగ్యవరంగా మంచిదని, దాన్నే కారంలో వినియోగిస్తారు. దీంతో గుంటూరు మిర్చి కంటే స్థానిక మిర్చి ధరే కిలోకు రూ.50 వరకు అధికంగా ఉంది. ఈ మిర్చిని మండలంలోని విసన్నపేట, జమాదులపాలెం, కన్నూరుపాలెం, సుందరయ్యపేట, తీడ, చెరకాం, జి.భీమవరం, అనకాపల్లి మండలంలోని సంపతిపురం, తమ్మయ్యపేట తదితర గ్రామాల్లో పండిస్తారు. ఆయా గ్రామాల నుంచి రైతులు కశింకోట, తాళ్లపాలెం సంతలకు తెచ్చి నాటు మిరపకాయలు విక్రయిస్తారు. వీటిని గంపలు, బస్తాల కొలతలు, తూనికతో కొనుగోలు చేస్తారు. వీటి ధర కిలో రూ.300కు విక్రయిస్తున్నారు. గత రెండు వారాల క్రితం కిలో రూ.250 ఉండేది. ప్రస్తుతం అది రూ.50 అదనంగా పెరిగింది. అలాగే గుంటూరు మిరపకాయలు కిలో రూ.220 నుంచి ఒక్కసారిగా రూ.250కి పెరిగింది.

ధర పెరిగిన జీలకర్ర

ఇక మసాలా కారం తయారీలో మరో ప్రధానమైన సరకు జీలకర్ర ధర కూడా అధికంగా పెరిగింది. పది రోజుల క్రితం వరకు కిలో రూ.350 ఉండగా, ఇప్పుడు రూ.490కి పెరిగింది. ఉత్పత్తి తక్కువగా ఉండటంతో వీటి ధరలు ఒక్కసారిగా పెరిగాయని వ్యాపారులంటున్నారు. ధరలు పెరిగినప్పటికీ ప్రత్యామ్నాయం లేక వీటిని కొనుగోలు చేసి కారం తయారు చేసుకోవడంలో నిమగ్నమవుతున్నారు. ఇక కారంలో వేసే పసుపు, ధనియాలు, ఆవాలు, మెంతులు, వెల్లుల్లి తదితర సరకుల ధరలు మాత్రం దాదాపు నిలకడగా ఉన్నాయి.

జగనన్నకు రుణపడి ఉన్నాం....


లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు


మెరక గ్రామాల నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాబూరావు

- ఎమ్మెల్యే బాబూరావుతో లబ్ధిదారులు
- గుడివాడ సచివాలయం పరిధిలో 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం

ఎస్.రాయవరం : సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందరికీ అందాయా...వాటి వల్ల లబ్ధి చేకూరిందా, మళ్లీ జగనన్నను దీవిస్తారా అని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. గుడివాడ సచివాలయం పరిధిలో 'మా నమ్మకం నువ్వే జగన్, జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. పలు గృహాలకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న లబ్ధి గురించి అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వానికి, ఇప్పటి ప్రభుత్వానికి తేడా, పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు లబ్ధిదారులు మాకు మళ్లీ జగనే కావాలి, గ్రామాల్లో మాలాంటి కుటుంబాలకు సంక్షేమం అందించి, తమని గుర్తించింది సీఎం జగన్‌మోహన్‌రెడ్డేనని, మా పథకాలు కూడా మాకు తెలియకుండా లబ్ధిదారులుగా మమ్మల్ని గుర్తించి, చెప్పిన మాట ప్రకారం నగదు ఇచ్చారన్నారు. తామంతా జగన్‌బాబుకి రుణపడి ఉన్నామని, ఇక్కడ ఎమ్మెల్యే గొల్ల బాబూరావుని గెలిపించుకుని సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు అందలం ఎక్కిస్తామన్నారు. ఈ క్రమంలో గ్రామంలో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోన లోవలక్ష్మి, జెడ్పీటీసీ కాకర దేవి, సర్పంచ్ దూళి శ్రీనుబాబు, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు కొణతాల శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీపతిరాజు, పోలిశెట్టి పెద ఈశ్వరరావు, వర్మ రాజు, సర్పంచ్‌లు మల్లే లోవరాజు, కోశెట్టి వెంకటరమణ, కర్రి సత్యనారాయణ, పాలపర్తి పాపారావు, వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న, మత్స్యకార సంఘ జిల్లా అధ్యక్షుడు మాతా గురునాథరావు, ఎంపీటీసీలు బాలం సూరిబాబు పాల్గొన్నారు.

గృహసారథులు ఇంటింటికీ వెళ్లాలి

నక్కపల్లి : సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికీ తిరిగి మా నమ్మకం నువ్వే జగనన్న.. కార్యక్రమాన్ని చిత్తశుద్ధితో నిర్వహించాలని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. సోమవారం ఆయన మండలంలో మెరక గ్రామాల నాయకులు, గృహసారథులతో మాట్లాడారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని ఇంటింటికీ తిరిగి పూర్తి చేయాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రభుత్వం వల్ల లబ్ధి పొందుతున్న ప్రతి లబ్ధిదారు ఇంటికి వెళ్లి వారు అందుకుంటున్న పథకాల వివరాలు తెలుసుకుని ప్రజా మద్దతు పుస్తకంలో నమోదు చేసుకోవాలన్నారు. ఏయే పథకాలు వర్తింపజేస్తున్నారనే వివరాలు తెలుసుకోవాలన్నారు. 8296082960 నంబరుకు లబ్ధిదారుడి ఫోన్ నుంచి మిస్డ్ కాల్ ఇవ్వాలన్నారు. లబ్ధిదారుల అనుమతితోనే వారి ఇళ్లకు మా నమ్మకం నువ్వే జగనన్న... స్టిక్కర్లు అతికించాలన్నారు. ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను గురించి తెలుసుకుని వారి మద్దతు పొందే సత్తా ఒక్క వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకే ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ లొడగల చంద్రరావు, సర్పంచ్ వియ్యపు శ్రీను, కర్రి శ్రీను, అల్లు రమణ, పార్టీ సీనియర్ నాయకులు శీరం నర్సింహమూర్తి, ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు పోతంశెట్టి రాజేష్ పాల్గొన్నారు. మండల సచివాలయ కన్వీనర్ల ఇన్‌చార్జ్‌గా ముకుందరాజుపేట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు వియ్యపు శ్రీనును నియమించినట్టు ఎమ్మెల్యే బాబూరావు తెలిపారు.

జగనన్న పాలనలో ప్రతి ఒక్కరికీ మేలు


తంగేడులో మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్ అంటిస్తున్న వైస్ ఎంపీపీ సీతారామరాజు

కోటవురట్ల : రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో మీరు లబ్ధి పొందారా...సంక్షేమ పథకాలతో మీరు సంతృప్తి చెందుతున్నారా...ఈ పథకాలు కొనసాగించాలా..అంటూ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి, వైస్ ఎంపీపీ ఆర్.ఎస్.సీతారామరాజు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. తంగేడు గ్రామంలో జగనన్నే మా భవిష్యత్ - మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజాభిప్రాయ పుస్తకంలో వివరాలు నమోదు చేయించారు. ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి మంచి పాలన అందిస్తున్నారని, ఆయనే సీఎంగా చిరకాలం ఉండాలని పలు కుటుంబాల సభ్యులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. జగన్ పాలనలో ప్రతి ఒక్కరికీ మేలు జరుగుతోందని, చిన్నారులకు మంచి భవిష్యత్ ఉందని మహిళలు స్పష్టం చేశారు. సీతారామరాజు మాట్లాడుతూ మరింత మెరుగైన పాలన కావాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ఆదరించాలన్నారు. ప్రతిపక్షాల కుట్రలు, మోసపూరిత వ్యాఖ్యలు నమ్మొద్దని సూచించారు. సంక్షేమ పథకాల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి లేదని, సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రతి కుటుంబానికి మేలు జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొరుప్రోలు శివకుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆర్.ఎస్.లక్ష్మీనరసింహరాజు, పార్టీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, యువకులు పాల్గొన్నారు.

ముఠా కార్మికులకు న్యాయం చేయాలి


అచ్యుతాపురం జంక్షన్‌లో మానవహారం నిర్వహిస్తున్న ముఠా కార్మికులు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని ముఠా కార్మికులకు న్యాయం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.రాము డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో ముఠా కార్మికులతో కలిసి సీఐటీయూ మానవహారం నిర్వహించింది. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ సెజ్‌లో రసూల్ డెక్కర్ ఫ్లైవుడ్ యాజమాన్యం మొండి వైఖరి కనబరుస్తోందని ఆరోపించారు. సెజ్ ఏర్పాటు కోసం రైతులు భూములిస్తే ఇక్కడ భూములు కోల్పోయి కూలీగా మారిన వారి పట్ల కర్మాగార యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముఠా కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఏపీఐఐసీ జడ్‌ఎం, లేబర్ అధికారులు, తహశీల్దార్లు తక్షణం దీనిపై విచారణ జరిపి ముఠా కార్మికులకు న్యాయం చేయాలని, గత 12 రోజులుగా శాంతియుతంగా నిరసన తెలిపినప్పటికీ ఎవరూ స్పందించకపోవడం అన్యాయం అని అన్నారు. గొర్లె సూరిబాబు, అప్పలనాయుడు, నగేశ్, సత్తిబాబు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేత కృష్ణమూర్తి మృతికి సంతాపం


కరణం కృష్ణమూర్తి

నక్కపల్లి : సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకుడు, జి.జగన్నాథపురం మాజీ సర్పంచ్, చీడిక రిజర్వాయర్ ఆయకట్టు రైతుల కమిటీ చైర్మన్ కరణం చిన కృష్ణమూర్తి (85) సోమవారం సాయంత్రం మరణించారు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న కృష్ణమూర్తి చికిత్స పొందుతూ విశాఖలో కన్నుమూశారని కుటుంబ సభ్యుడు కరణం ఈశ్వరరావు తెలిపారు. కృష్ణమూర్తి జగన్నాథపురం గ్రామానికి దాదాపు మూడు దశాబ్దాలుగా సర్పంచ్‌గా పనిచేశారు. మెరక గ్రామాల వారికి సాగునీరు అందిస్తున్న చీడిక రిజర్వాయర్ ఆయకట్టు రైతుల కమిటీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు, మౌలిక సదుపాయాల కల్పనకు దేశవ్యాప్తంగా ఆర్థిక సాయం అందిస్తున్న బిగ్‌హెల్ప్ సంస్థకు డైరెక్టర్‌గా కూడా వ్యవహరిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి జగనన్న వెంట నడుస్తూ మెరక గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి ఎంతో కృషి చేశారు. ఎనిమిది పదుల వయసులో కూడా రైతాంగ సమస్యలపైనే పోరాటం చేస్తూ ప్రజాప్రతినిధుల సాయంతో పరిష్కారానికి కృషి చేసేవారు. కృష్ణమూర్తి మరణం వైఎస్సార్‌సీపీకి, రైతాంగానికి తీరని లోటని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ అన్నారు. కృష్ణమూర్తి మరణం పట్ల ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, మండల పార్టీ అధ్యక్షుడు పొడగట్ల పాపారావు, డీసీఎంఎస్ మాజీ ఉపాధ్యక్షుడు మణిరాజు, వైస్ ఎంపీపీలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, పార్టీ సీనియర్ నాయకులు శీరం నర్సింహమూర్తి, లొడగల చంద్రరావు, కరణం ఈశ్వరరావు, మాజీ ఎంపీపీ బొల్లం బాబ్జి, సర్పంచ్‌లు కర్రి శ్రీనివాస్, వియ్యపుశ్రీను, అల్లురమణ, సాదిరెడ్డి శ్రీను, ఎంపీటీసీలు నిట్ల గోవిందు, మాజీ సర్పంచ్ కుంచా సురేష్, కాకర వెంకటరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు యలమంచి తాతబాబు, సూరాకాసుల గోవిందు సంతాపం వ్యక్తం చేశారు.

రహదారి భద్రతపై ర్యాలీ

కశింకోట : మండలంలోని లాలం కొత్తూరు గ్రామంలో రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తూ స్వయం సహాయక సంఘాల మహిళలు సోమవారం ర్యాలీ నిర్వహించారు. వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, హెల్మెట్, సీటు బెల్టు ధరించాలని కోరారు. ర్యాలీలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అరుణ, ఏపీఎం ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.